## ఊపందుకున్న ఉపాధి హామీ




తంబళ్లపల్లె, మే 16, ప్రభాతవార్త:
తంబళ్లపల్లె మండలంలో ఈధ్య కురిసిన భారీ వర్షాలతో మండలంలో ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. మండలంలో ఉపాధి హామీలు ట్రెంచీలు, నీటి పరివాహక ప్రాంతాల్లో నీటి నిల్వ గుంతలతో పాటు మొక్కల పెంపకానికి అనువైన ప్రాంతాల్లో ఇంకుడు గఉుంతల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఉపాధి హామీ ఏపీడీ మధుబాబు ఆదేశాలతో ఏపీవో అంజనప్ప సూచనలతో ఉపాధి ఈసీ రామన్న ఆధ్వర్యంలో టెక్నికల్ అసిస్టెంట్లు వెంకటరమణ, శంకర, నాగార్జున, శేఖరమ్మలు మండలంలోని 21 పంచాయతీలలో క్షేత్ర సహాయకులు స్థానికంగా గల ఉపాధి కూలీలతో పనులు వేగవంతం చేశారు. మండలంలోని తంబళ్లపల్లె, పరసతోపు, ఆర్ఎన్.తాండా, గుండ్లపల్లి, రేణిమాకులపల్లి, కోసువారిపల్లి, కోటకొండ, కుక్కరాజుపల్లి, ఎద్దులవారిపల్లి, బాలిరెడ్డిగారిపల్లె, అన్నగారిపల్లి, కొటాల పంచాయతీలలో వందలాదిగా కూలీలు ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఈసీ రామన్న గురువారం తంబళ్లపల్లె ఉపాధి హామీ పనుల పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనులలో నాణ్యత లోపించరాదని ప్రతి నీటి బొట్టు వృథా కాకుండా భవిష్యత్తులో నీటి కష్టాలు తొలగించడానికి ఈ ఉపాధి పనులు దోహదపడాలని అదే విధంగా మొక్కల పెంపకం వాటి సంరక్షణతో భవిష్యత్తులో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పూర్తి సహకారం అందించాలనికోరారు. ఆయనవెంటటెక్నికల్అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకుడు రమేష్, కూలీలు పాల్గొన్నారు.

## సమ్మర్ క్యాంపులో విధ్యార్థులకు క్వారంబోర్డు, చెస్ ఆటలు, గణిత బోధన తరగతులు




ప్రొద్దుటూరు, మే 16, ప్రభాతవార్త:
పౌర గ్రంధాలయ శాఖ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు బాల బాలికల గ్రంధాలయం ఆధ్వర్యంలో వసంతపేట మున్సిపల్ హైస్కూల్ నందునిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో భాగంగా గురువారం విద్యార్ధులకు గణిత ఉపాధ్యాయురాలు ఎస్.నిర్మల జ్యోతి గణితమునకు సంబంధించిన అంకెలు, సంఖ్యలు, కూడికభావన, తీసివేత, గుణకారం, భాగహారం, స్థాన విలువలు, విస్తరణ రూపం, భిన్నాల పంచమాల గురించి తెలియజేశారు. పుట్టపర్తి సాహితీ పీఠం కార్యదర్శి జింకా సుబ్రమణ్యంవిద్యార్ధులకు వేమన పద్యాలు, వాటి భావాలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమానికి 14మంది విద్యార్ధులు హాజరయ్యారు. అనంతరం విద్యార్ధులకు క్వారంబోర్డు, బెస్ట్ ఆటలకుసంబంధించిన తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రహీం సాహెబ్, రవిబాబు, రెహ్మాన్ ఖాన్, శారదలు పాల్గొన్నారు.

## తారా స్థాయికి చేరిన టీడీపీ నాయకుల ఫ్రెస్టేషన్ - గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్



కడప కార్పొరేషన్, మే 16, ప్రభాతవార్త: సార్వత్రిక ఎన్నికల్లో ఘోర ఓటమి తప్పదని స్పష్టం కావడంతో టీడీపీ నాయకుల ఫ్రస్టేషన్ తారాస్థాయికి చేరుతోందని వైసీపీ గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ బీహెచ్ అన్నారు. ఎన్ని పార్టీలు ఏకమై కుతంత్రాలు చేసినా జగన్ వైపే ప్రజలు ఉన్నారన్నారు. రాష్ట్రంతో పాటు కడప, అన్నమయ్య జిల్లాల్లో అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే వైసీపీ అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రాజంపేట, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అభ్యర్థులు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులను గల్ఫ్ ప్రవాసాంధ్రులు మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యంగా కువైట్ నుంచి ఎక్కువ మంది వచ్చారని, ఇలియాస్, బాలిరెడ్డిల గ్రూప్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గల్ఫ్ కన్వీనర్ ఇలియాస్ బీహెచ్, గల్ఫ్ కో కన్వీనర్ గోవిందు నాగరాజులు, కన్వీనర్లు రమణ యాదవ్, మర్రి కల్యాణ్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ 135 నియోజకవర్గాల్లో విజయం సాధిస్తుందని జోష్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ షేక్ జాఫర్ అలీ, కువైట్ కమిటీ సభ్యులు షేక్ యాసిన్, అన్నమయ్య జిల్లా సోషల్ మీడియా ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## క్షయ నిర్మూళనే ప్రభుత్వ ధ్యేయం




ఖాజీపేట, మే 16, ప్రభాతవార్త: ఖాజీపేట ప్రాధమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆంజనేయకొట్టాలు గ్రామంలో డాక్టర్ ముబీన్ ఆధ్వర్యంలో అడల్ట్ బి.సి.జి వ్యాక్సినేషన్‌ప్రోగ్రాం అనాగురేషన్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సునీత జిల్లా అంధత్వ నివారణ అధికారి ప్రోగ్రాం ఆఫీసర్ ద్వారా నిర్వహించడం జరిగింది. క్షయ వ్యాధి నివారణకొరకు ముందు జాగ్రత్త చర్యలో భాగంగా మొదటి విడతగా షుగర్ వ్యాధిగ్రస్థులకు, పొగ త్రాగువారికి, బిఎంఐ 18కంటే తక్కువ ఉన్నవారికి, 60సంవత్సరములు పైబడిన వారికి అడల్ట్ బిసిజి వ్యాక్సిన్ వేశామని డాక్టర్ సునీత తెలిపారు. డాక్టర్ ముబీన్ వ్యాక్సినేషన్ వ్యాక్సిన్ వేసే విధానాన్ని పర్యవేక్షించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. 2025 భారతదేశంలో టీబీ పూర్తిగా నిర్మూళన చేయాలన్నారు. ఈ అడల్ట్ బిసిజి వ్యాక్సిన్ ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ప్రపంచ డెంగ్యూడే సంధర్భంగా దోమ ద్వారా కలుగు డెంగ్యూ జ్వరం గురించి నివారణ చర్యలు ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా చేద్దామని, హఠాత్తుగా వచ్చే తీవ్ర జ్వరం తలనొప్పి, కండరాలు, కీళ్లనొప్పులు, ఆకలి మందగించడం, వాంతులు, చర్మంపై దద్దుర్లు, కళ్ల నొప్పి, ఒక్కసారి ఇంట్లో రక్తస్రావం జరిగిప్రాణాలకు ముప్పు రావచ్చు అని ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి బి.నాగభూషణం, హెల్త్ సూపర్‌వైజర్ ఏ.శోభన్‌బాబు, బి.కృష్ణప్రియ, ఆశ నోడల్ ఆఫీసర్ ఈ.అరుణకుమారి, ఎంఎల్‌హెచ్ పి.వి సునీల, ఆరోగ్య కార్యకర్తలు జె.రాధ, ఆశా కార్యకర్తలు పద్మావతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం



ప్రొద్దుటూరు, మే 16, ప్రభాతవార్త:
అమ్మ హెల్పింగ్ హ్యాండ్ కువైట్ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులోని విశ్వ ప్రేమ వృద్ధాశ్రమంలో స్వర్గీయ బెజవాడ రమణమ్మ మూడవవర్ధంతి సంధర్భంగా గురువారం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వికసిత ఫౌండేషన్ చైర్మెన్ శూలం లక్ష్మి దేవి మాట్లాడుతూ వర్ధంతులకు, పుట్టినరోజులకు, పెండ్లి రోజులు జరుపుకునే ప్రతి ఒక్కరూ హంగు ఆర్భాటాలు లేకుండా వృద్ధాశ్రమాలకు, అనాధ ఆశ్రమాలకు అన్నదానంచేయడం చాలా మంచిది అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లియాదవ్, విశ్వనాధ్ పాల్గొన్నారు.

## మండలంలో 87.7శాతం పోలింగ్

దువ్వూరు, మే 16, ప్రభాతవార్త: మండల పరిధిలోని 55 పోలింగ్ కేంద్రాలలో 87.7శాతం పోలింగ్ నమోదు అయినట్లు మండల ఎన్నికల అధికారులు తెలిపారు. సోమవారం జరిగిన
పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు గాను దువ్వూరు మండలంలో 55 పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటుచేశారు. మండలంలో 40,822 మంది ఓటర్లు ఉండగా 35,793 మందిఓటర్లు తమ ఓటు హక్కును నమోదు చేసుకున్నారు. దీంతో 87.7శాతం నమోదు అయిందని పేర్కొన్నారు. మండల పరిధిలోని దాసరిపల్లె పోలింగ్ కేంద్రంలో 96.3శాతం అత్యధికంగా నమోదైందని అన్నారు. 24పోలింగ్ కేంద్రాలలో 90శాతంకు పైగా నమోదు కాగా 19 పోలింగ్ కేంద్రాల్లో 80 నుంచి 90శాతం నమోదు అయిందని, మిగతా11 పోలింగ్ కేంద్రాల్లో 77శాతం నమోదు అయింది. మండల కేంద్రమైన దువ్వూరులో ఏర్పాటు చేసిన 8పోలింగ్ కేంద్రాల్లో 77శాతం పోలింగ్ నమోదు అయింది. ఒక దువ్వూరులోపోలింగ్ కేంద్రాలలోనే తక్కువ పోలింగ్ శాతం నమోదు అయినట్లు తెలుస్తోంది.

## వర్షాలు రావాలి.. ప్రజలు సంతోషంగా ఉండాలి



కడప వైద్యవిభాగం, మే 16, ప్రభాతవార్త:
నగరంలోని బిల్టప్ సవీపంలో కృపా కాలనీలో న్యూ నేటివ్ కృపా ప్రార్థనా మందిరంలో గురువారం పాస్టర్ మహేష్, సిస్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో సకాలంలో వర్షాలు కురవాలని భక్తులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో దైవజనులు మహేష్ మాట్లాడుతూ మానవాళితో పాటు సకల జీవరాశులు జీవించాలంటే వర్షాలు కురిస్తేనే భూమిపైన న రైతులు పంటలు పండిసానతరని తాగడానికి నీరు సమృద్ధిగా ఉంటుందని ఈ సంవత్సరం ఎండలు మరీ ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని దీనికి ఉపశమనంగా దేవుడు కరుణించి సకాలంలో వర్షాలు కురిపించాలని కరవు కాటకాలు రాకూడదని ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వాసులు రవితేజ, శాంతిరాజు, అశోక్, అగస్టిన్, నరసయ్య, రవి, రోజా, లీలావతి, సుగుణమ్మ, అనేక మంది భక్తులు పాల్గొని వర్షాలు కురిసి ప్రజలు శాంతి సమాధానంతో జీవించాలని దేవున్ని వేడుకున్నారు.

## కమలాపురం మండలానికి 50 క్వింటాళ్లు జీలుగలు మంజూరు

కమలాపురం, మే 16, ప్రభాతవార్త: కమలాపురం మండలంలోని వరి సాగు చేయు రైతులకు కమలాపురం మండలానికి 50 క్వింటాళ్లు జీలుగల విత్తనాలు 4 క్వింటాళ్లు పిల్లిపెసర విత్తనాలు మంజూరయ్యాయని ఆర్‌బీకేలలో పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, మొబైల్ నంబరుతో జీలుగలు పొందాలని మండల వ్యవసాయాధికారి ఎం.సరస్వతి తెలిపారు.

## బీసీజీ వ్యాక్సిన్ పై అవగాహణ కార్యక్రమం




ప్రొద్దుటూరు అర్బన్, మే 16, ప్రభాతవార్త: యూపీహెచ్‌సీ టీబీ రోడ్డు పరిధిలోని 6 సచివాలయం నందు 18సంవత్సరాలు పైబడిన వారికి క్షయ వ్యాధి నివారణల కొరకు
ముందు జాగ్రత్త చర్యలో మొదటి విడతలో భాగంగా షుగర్ వ్యాధిగ్రస్థులకు, పొగ త్రాగువారికి, గతంలో టీబి వచ్చిన వారికి బిఎంఐ 18కంటే తక్కువ ఉన్నవారికి, షుగర్
వ్యాధిగ్రస్థులకు 60సంవత్సరములు పైబడిన 156మందికి అడల్ట్ బిసిజి వ్యాక్సిన్ వేశారు. అన్ని అంగన్వాడి సెంటర్స్ నందు అడల్ట్ బిసిజి వ్యాక్సిన్ యొక్క ప్రాముఖ్యత గురించి
ప్రజలకు వైద్యాధికారి హిమబిందు, టిబి సూపర్‌వైజర్ రాజారత్నం అవగాహణ కల్పించారు. ఈ కార్యక్రమంలో సీఓ సుబ్బారెడ్డి, టిబి సిద్ధారెడ్డి, ఏఎన్ఎంలు మల్లేశ్వరమ్మ,
రెబెకా, ఆశాలు పాల్గొన్నారు.

## ఈబీసీజీ టీకా సురక్షితమైనది



ప్రొద్దుటూరు అర్బన్, మే 16, ప్రభాతవార్త:
బాపూజి నగర్ కేహెచ్ఎం వీధిలోని సచివాలయం నందు “వయోజన బిసిజి టీకా” ప్రోగ్రాంను గురువారం అర్బన్ వైద్యాధికారిడాక్టర్ శివప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గురువారం సచివాలయం నందు లేదా అంగన్వాడి కేంద్రం నందు క్షయ వ్యాధినిర్మూళన చేసేందుకు ఈబిసిజి టీకాలు ఇస్తున్నామని, క్షయ వ్యాధి రావడానికి ఎక్కువ అవకాశం ఉన్న పెద్ద వయస్సు వారికి ఈబిసిజి టీకా ఇవ్వడం ద్వారా సమాజంలోకొత్త క్షయ వ్యాధి కేసుల సంఖ్య తగ్గించడం జరుగుతుందని, ఈబిసిజి టీకా 60సంవత్సరాలు పైబడిన వారికి, 18సంవత్సరాల కంటే ఎక్కువ ఉన్నవారు ఈ క్రింది వాటిలోఏదైనా ఒకదానిని కలిగి ఉంటే వారికి బిసిజి టీకా ఇవ్వబడునని, గత 5సంవత్సరాలలో క్షయ వ్యాధి కలిగిన వ్యక్తులకు, క్షయ వ్యాధి కేసు యొక్క కుటుంబ సభ్యులకు, బాడీ మాస్ ఇండెక్స్ 18కన్నా తక్కువ ఉన్నవారికి, ప్రస్తుతం లేదా గతంలో ధూమపానం చేసే వ్యక్తులకు, మధుమేహ వ్యాధి ఉన్న వ్యక్తులకు ఇవ్వబడునని, ఈబిసిజిటీకా సురక్షితమైనది కావున అర్హులైన వ్యక్తులందరూ ఈ టీకా వేయించుకొని క్షయ వ్యాధి నిర్మూళనకు పాటుపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం సునీత, రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్కే హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో వృద్దులకు నిత్యావసర సరుకులు పంపిణీ




ప్రొద్దుటూరు క్రైం, మే 16, ప్రభాతవార్త:
శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమం నందు 3వ పట్టణ పీఎస్ సీఐ వెంటకరమణ చేతుల మీదుగా వృద్దులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్దులు ఆర్కే హెల్పింగ్ హ్యాండ్ వారిని అభినందించారు.

# వైభవంగా వాసవిమాతాకు విశేష పూజలు

## : వివాహం కాని యువతులకు నవదుర్గ కన్యక పూజ: విశేష సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

బద్వేలు అర్బన్, మే 16 (ప్రభాతవార్త): శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని పురస్కరించుకుని గురువారం ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కేవి.సుబ్బారావు , సెక్రటరీ నాగరాజ, జాయింట్ సెక్రటరీ సగళా సురేష్‌బాబు, ట్రెజరర్ ఇమ్మడిశెట్టి చంద్రశేఖర్, వైస్‌ప్రెసిడెంట్లు మునగా చలమయ్య, దర్శి వెంకటేశ్వర్లుతో పాటు పలువురు కమిటి సభ్యుల ఆధ్వర్యంలో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి తెల్లవారుజామునుంచే వివిధ రకాల విశేష పూజలను వైభవంగానిర్వహించారు. వాసవిమాత అమ్మవారికి వివిద రకాల ప్రత్యేక పూలతో చేపట్టిన అలంకారం పలువురి భక్తులను ఆకట్టుకుంది. అలాగే మహిళా మండలి అధ్యక్షురాలు దేవతి లలిత, స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి, మాజీఅధ్యక్షురాలు చింతకుంట ధనమ్మ, సెక్రటరీ గంగిశెట్టి ధనలక్ష్మిలతో పాటు పలువురు మహిళా మండలి కమిటి సభ్యుల ఆధ్వర్యంలో 18 సంవత్సరాలు నిండి వివాహం కాని యువతులకు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సన్నిధిలోలక్కిడిప్ ద్వారా తొమ్మంది నవదుర్గ కన్యకలకు మంగళస్నానాలు, విద్యాబుద్ధి, ఆరోగ్యం తో పాటు వారికి అన్ని విధాలా అమ్మవారి ఆశీర్వాదాలు ఉండాలని వేదపండితులు సుబ్బనరసయ్యస్వామి మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. వాసవిమాత అమ్మవారిని దర్శించుకునేందుకు విశేష సంఖ్యలో భక్తులందరూ పాల్గొని వాసవిమాతను దర్శించుకున్నారు. భక్తులందరికీ ఆలయ కమిటి సభ్యులు ప్రత్యేక తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పబ్బతి చక్రపాణి, చింతకుంట రవి, జూటూరు పద్మ, కళ్యాణి, సుగుణ, కొండపల్లి లక్ష్మికాంతమ్మ, శ్రావణి, సగళా సుశీల, వందవాసి ధనమ్మ, పబ్బతి వసంత లక్ష్మి, గొంట్ల కుమారి, చలపాటి క్రిష్ణవేణి, యాదాళ్ల సుధారాణి, కుప్పం శర్వాణి, లక్ష్మినారాయణమ్మ, చింతకుంట సుభాషిణి, మంజుల, బచ్చు పార్వతి, సముద్రాల మాదవిలత తో పాటు పలువురు పాల్గొన్నారు. ఆర్యవైశ్య వర్తక సంఘం కమిటి సభ్యులతో పాటు పలువురు పాల్గొన్నారు.





## అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు-ఎస్ఐ

దువ్వూరు, మే 16, ప్రభాతవార్త: ఎన్నికల పోలింగ్ అనంతరం గ్రామాలలో ఎవరైన, ఎక్కడైన అల్లర్లకు పాల్పడితే పోలీస్ చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని
ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రశాతంగా ఎన్నికలు జరిగాయని అదేవిధంగా గ్రామాల్లో ప్రశాంతంగా ఉండాలని పేర్కొన్నారు.
ఎక్కడైన పొరపాటున అల్లర్లకు పాల్పడితే అతి కఠినమైన సెక్షన్‌లతో కేసులు నమోదు చేసి రౌడిషీట్ కూడ ఓపన్ చేస్తామన్నారు. గ్రామంలో ఏదైన సమస్య ఉంటే పోలీసుల
దృష్టికి తీసుకొని వస్తే దానిని పరిష్కరిస్తామని తెలిపారు.

## అగస్త్యేశ్వర స్వామి వారి గ్రామోత్సవం

ప్రొద్దుటూరు అర్బన్, మే 16, ప్రభాతవార్త: స్థానిక అగస్త్యేశ్వరాలయంలో ఆలయ ఈఓ అండ్ అసిస్టెంట్ కమీషనర్ శంకర్ బాలాజి, ఆలయ చైర్మెన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి,
పాలక మండలి సభ్యుల ఆధ్వర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజు గురువారం తెల్లవారుజాము నుండే స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ
రుద్రాభిషేకములు, అమ్మవారికి కుంకుమార్చనలు, ఉదయం మండప స్థిత దేవతలకు పూజలు, దీక్షా నిత్యోపాసన హోమములు, నిత్య బలిహరణ గ్రామోత్సవం కార్యక్రమాలు,
సాయంత్రం మండప స్థిత దేవతలకు పూజలు, దీక్షా నిత్యోపాసన హోమములు, నిత్య బలిహరణ, శ్రీ గంగా హోమములు, నిత్య బలిహరణ, శ్రీ గంగా రాజరాజేశ్వరి
సమేత అగస్త్యేశ్వర స్వామి వారికి గ్రామోత్సవ మహోత్సవము కార్యక్రమములు ఆలయ అర్చకులు, పాఠశాల గురువు విద్యార్ధులచే ఘనంగా జరిగాయి, సాంస్కృతిక కార్యక్రమాలలో



# ఆదిపత్యం ఎవరిది ?

బాలసుబ్రమణ్యంను అభ్యర్థిగా ఖరారు చేసింది. బాలసుబ్రమణ్యం రాకతో తెలుగుదేశం పార్టీలో ప్రారంభంలో ఊపు కనిపించింది. మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు గత ఎన్నికల్లో చేయలేని పని బాలసుబ్రమణ్యం వచ్చాక తనసమాజిక వర్గాన్ని ఏకతాటి పైకి తీసుకొచ్చారనడంలో సందేహం లేదు. అందుకు కారణం కూటమిలో జనసేన చేరడం కూడా ప్రధానం. చంద్రబాబు - పవన్ కళ్యాణ్ ఉమ్మడిగా సభలు నిర్వహించడం కూడా పార్టీకి కలిసి వచ్చింది. సామాజిక వర్గం ఏకం కావడానికి ఇది కూడా ఒక ప్రధాన కారణంగా పేర్కొనవచ్చు. దీనికి తోడు టికెట్ రాకపోవడంతో ఆగ్రహంతో ఉన్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి వర్గంలో కీలక నేతలంతా తెలుగుదేశానికి మద్దతు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇంతలోపే ఆయన సోదరుడు రఘునాథ్ రెడ్డి రంగంలోకి దిగి సరిదిద్దే ప్రయత్నం చేశారు. వీరబల్లె, రాజంపేట ,నందలూరు మండలాల్లోచాలా వరకు పైచేయి సాధించారు. అయినా కూడా జిల్లా కేంద్రం పోవడం, మెడికల్ కాలేజీ మదనపల్లి కు తరలిపోవడం, అన్నమయ్య ప్రాజెక్టు పునర్ నిర్మాణం చేయకపోవడం ప్రజల్లో వ్యతిరేకత పెంచిందనేది సర్వత్ర అభిప్రాయం. దీనికి తోడు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి బాలసుబ్రమణ్యం తండ్రి పాలకొండ్రాయుడికి నియోజకవర్గాల పునర్విభజనకు ముందు రాజంపేట ,వీరబల్లి మండలాలతో ఉన్న పరిచయాలు కీలకంగా మారి ఈ మండలాల్లో టిడిపికి అనుకూలంగా ఉంటాయని ప్రచారం జరిగింది. ఎలాగూ నియోజవర్గంలో 30శాతం ఓట్లు ఉన్న రాజంపేట మండలంలో ఎటు తెలుగుదేశం పార్టీకి మెజార్టీ లభిస్తుందని ధీమా గా ఉన్నారు. మేడా వర్గీయుల రాకతో సిద్ధవటం మండలంలో కూడా తెలుగుదేశం పార్టీకి మెజారిటీ లభిస్తుందని ఊహించారు.ఒకవైపు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సభ, మరోవైపు లోకేష్ యువతతో నిర్వహించిన సమావేశం పార్టీకి మరింత జోష్ పెరిగిందని అటు పార్టీలోను, ఇటు ప్రజల్లో కూడా ప్రచారం జరిగింది. ఇది అంతా నాణెంకు ఒకవైపు మాత్రమే . ఇంతలో వైసిపి కీలక నేత రాజంపేట నియోజకవర్గంలో విజయం సాధించాలంటే, పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నిలబడాలంటే ఏదో ఒకటి చేయడం తప్పదని గట్టిగా నిర్ణయం తీసుకున్నారు. మొదట టిడిపి ఊహించని విధంగా ఓటుకు మూడు వేలు పంచాలని నిర్ణయించారు. వెంటనే అమలు చేశారు. వెను వెంటనే సీఎం జగన్ ప్రోగ్రాం ఖరారు. పోలింగ్ కు రెండు రోజులు ముందు జగన్ రావడం,ఓటుకు భారీగా పంపకాలు చేయడంతో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఖంగుతిన్నారు. అంత సొమ్ము పంచలేమని చేతులెత్తేశారు. చివరకు గ్రామీణ ప్రాంతాలలో ఓటుకు 1000 రూపాయలు, రాజంపేట పట్టణంలో 1500 రూపాయలు పంచేందుకు నిర్ణయించారు. అప్పటికే ఆలస్యం కావడం, సొమ్ము ఓటరుకు చేరడంలో జాప్యం జరగడం, అదికూడా అరకొరగా జరగడంతో వైసీపీ శ్రేణులు విజయంపై ధీమా వ్యక్తం చేస్తున్నాయి. రాజంపేట మండలం మినహా అన్ని మండలాల్లో తమకే మెజార్టీ వస్తుందని బల్ల గుద్ది చెబుతున్నారు. మరోవైపు తెలుగుదేశం పార్టీ నేతలు మాత్రం తక్కువ మెజారిటీతోనైనా విజయం తమదేనని చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో పందెం రాయుళ్లు వైసిపి వైపే మొగ్గు చెబుతున్నారు. కొందరు పదివేల మెజార్టీకి పందెం కాస్తుంటే, మరికొందరు గెలుపుపై పందెం కాస్తున్నారు. ఏది ఏమైనా వైసిపి గెలుపు పై ధీమాకు పక్క ప్రణాళికతో ప్రచారం చేయడం, ఒకటికి నాలుగు సార్లు ఓటర్లను కలవడం, పోల్ మేనేజ్మెంట్ విషయంలో బయటి నుంచి వచ్చిన వ్యక్తులు ఓటర్లకు డబ్బులు పక్కాగా పంచడం, క్లైమాక్స్ లో సీఎం జగన్ సభ సక్సెస్ కావడం ప్రధాన కారణంగా చెబుతున్నారు. అంతేకాకుండా టిడిపి పోల్ మేనేజ్మెంట్ ఫెయిల్యూర్ అని, ఓటర్లకు డబ్బులు పంచడంలో విఫలమయ్యారని వాపోతున్నారు. అయితే తెలుగుదేశం నాయకులు మాత్రం రాజంపేట ,సుండుపల్లె, సిద్ధవటం మండలాల్లో మెజారిటీ తమకే వస్తుందని భావిస్తున్నారు. ఏదేమైనా ప్రజల్లో మాత్రం సొమ్ము పంపకంపైనే అభ్యర్థుల విజయావకాశాలు ఆధారపడి ఉంటాయని చర్చ జరుగుతోంది. ఓటుకు నోటు పనిచేస్తే రాజంపేటలో వైసీపీదే విజయమని, లేదంటే తెలుగుదేశం పార్టీ విజయం సాధిస్తుందని వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా రాజంపేట పట్టణంతో పాటు అధికార వైకాపాకు జిల్లా కేంద్రం చేయకపోవడం, మెడికల్ కాలేజీ వెళ్లిపోవడం, అన్నమయ్య ప్రాజెక్టు పునర్ నిర్మాణం చేయకపోవడం, చెయ్యేరు నదీ పరివాహ గ్రామాలను పట్టించుకోకపోవడం ప్రతికూలం అవుతాయని, ఇదే జరిగితే ఈ మండలంలో తెలుగుదేశం పార్టీకి భారీ ఆధిక్యత లభించే అవకాశం ఉంది. ఇది సాధ్యం కాకపోతే ఓటుకు నోటు దే పైచేయి అవుతుందనడంలో సందేహం లేదు. జూన్ 4 న ఓటు ఆధిపత్యం సాగుతుందా, నోటు ఆధిపత్యం జరుగుతుందా అనేది స్పష్టం కానుంది.

# తగ్గుతున్న టమోటా ధరలు ఆందోళనలో రైతులు

మదనపల్లెక్రైం, మే 16 ప్రభాతవార్త:



టమోటా ధరలు గత వారం రోజులుగా తగ్గుముఖం పడుతున్నట్లు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గురువారం టమోటా మార్కెట్‌యార్డులో మొదటిరకం పదికిలోల టమోటా బాక్స్ రనూ.160నుంచి 130ల వరకు ధర పలికింది. రెండవ రకం రూ.90నుంచి 120ల వరకు ధర పలికింది. 544మెట్రిక్ టన్నుల టమోటాలు మార్కెట్‌యార్డుకు వచ్చాయి. అప్పులు చేసి సాగు చేసిన టమోటాకు గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో టమోటా పంటను జీవనాధారపంటగా రైతులు సాగు చేస్తారు. ఏడాది పొడవునా టమోటా సాగు అవుతూనే ఉంటుంది. వేసవిలో ధరలు వస్తాయని రైతులు మదనపల్లె, తంబళ్ళపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో టమోటాను విస్తారంగా సాగు చేశారు. బయట ప్రాంతాల్లో టమోటాకు డిమాండ్ లేకపోవడం వల్లనే ధరలు పెరగడం లేదని వ్యాపారస్తులు చెబుతున్నారు. మదనపల్లె మార్కెట్‌యార్డు నుంచి టమోటాను తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, మద్యప్రదేశ్, ఒడిస్సా, తెలంగాణ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలతో పాటు ప్రధాన నగరాలకు ఎగుమతి చేస్తారు. టమోటా వ్యాపారా లావాదేవీలతో వేలాది మంది కూలీలు జీవనోపాధి పొందుతుంటారు. టమోటాకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# అల్లనేరేడు పండ్లువచ్చేశాయ్..

## అల్లంత దూరాన-అల్లనేరేడు పండ్లుదిగుబడి తక్కువ-ధర ఎక్కువ



మదనపల్లెక్రైం, మే 16 ప్రభాతవార్త:

అల్లనేరేడు పండ్లు సామాన్యునికి అల్లంత దూరాన ఉన్నాయి. ఈ ఏడాది పంట దిగుబడి తక్కువ కావడంతో ధరలు ఆకాశానంటుతున్నాయి. మదనపల్లె మార్కెట్‌లో మొదటిరకం కిలో అల్లనేరేడు రూ.250నుంచి 280వరకు ధరలు పలుకుతున్నాయి. రెండవ రకం రూ.170నుంచి 200వరకు ధరలు ఉన్నాయి. మూడవ రకం కిలో రూ.100నుంచి 150వరకు ధరలు పలుకుతున్నాయి. వర్షాభావ పరిస్థితులు, వేసవి తీవ్రం కావడంతో ఈ ఏడాది అల్లనేరేడు పంట దిగుబడి తక్కువ శాతం వచ్చింది. అంతేకాకుండా ఎగుమతి ప్రాంతాల్లో అల్లనేరేడు డిమాండు ఎక్కువుగా ఉండడం వల్లే ధరలు అధికంగా ఉంటున్నాయంటూ ఇటు వ్యాపారస్తులు, అటు రైతులు చెబుతున్నారు. జిల్లాలోనే మదనపల్లె డివిజన్‌లో అల్లనేరేడుసాగు విస్తారంగా సాగు చేశారు. మదనపల్లె, కురబలకోట, రుషివ్యాలీ, తంబళ్ళపల్లె, పెద్దమండ్యం, గుర్రంకొండ, వాల్మీకిపురం, నిమ్మనపల్లె ప్రాంతాల్లో అల్లనేరేడు ఎక్కువ సాగులో ఉంది. డివిజన్ ప్రాంతమైన మదనపల్లెలో అల్లనేరేడు కాయలు మార్కెట్ ప్రతి ఏటా సీజన్‌లో ప్రారంభిస్తారు. ఇక్కడ 15మండీ నిర్వాహకులు కాయల వ్యాపార లావాదేవీలను నిర్వహిస్తారు. ఇక్కడ నుంచి చెన్నై, ఈరోడ్డు, కొయ్యంబత్తూరు, విజయవాడ, హైదరాబాద్, బెంగుళూరు, ప్రొద్దుటూరు, కడప, కేరళ తదితర పట్టణ ప్రాంతాలకు ఎగుమతిచేస్తారు. సీజన్‌లో సుమారు 2వేల మంది కూలీలు జీవనోపాది పొందుతూ ఉంటారు. గత ఏడాది కంటే ఈఏడాది పంట దిగుబడి తక్కువుగా ఉండడం వల్ల ధరలు అధికంగా ఉన్నాయంటూ చెబుతున్నారు. అల్లనేరేడు పండ్లు పలు వ్యాధుగ్రస్తులకు ఉపయోగకరంగా ఉండడంతో పలువురు వీటి కోసం ఎగుబడుతున్నారు. ముఖ్యంగా మధుమేహం వ్యాధి గ్రస్తులకు అల్లనేరేడు పండ్లు వరంగా ఉంటుంది. వైద్యులు సైతం రోగులకు అల్లనేరేడు పండ్లు తినేందుకు సూచనలు ఇస్తుంటారు.



# చీ..ఛీ కంపు

# బాబోయ్ కంపు



వారుఇంటిలో నుంచి బయటకు రావాలన్నామురికినీటిలోనే రావా ల్సిన పరిస్థితిఏర్పడిందని సాయం కాలం దోమల వ్యాప్తి అధికంగా ఉందనిమున్సిపల్ అధికారులు వెంటనేస్తంభించినడ్రైనేజీ కాలువ లలో పూడుకుపోయిన చెత్తను తరలించాలని కోరారు. మురికి నీటి వాసన భరించలేకున్నాం : సుమిత్రానగర్ పద్మావతి హాస్పిటల్‌కు వెళ్లే ప్రదాన రహదారి వద్ద డ్రైనేజీ కాలువ పూర్తిస్థాయిలో నిండిపోయి రోడ్డుపైనే స్తంభించడంతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. సాయంత్రం దోమలవ్యాప్తిఅధికంగా ఉందని అక్కడ నివాసం ఉండాలంటే ఆ వాసన భరించలేకున్నామని కావున మున్సిపల్ అధికారులు తక్షణమేస్తంభించిన డ్రైనేజీ కాలువలో పూడికను తీయించి కాలువలను పరిశుభ్రం చేయించాలి
కందుకూరి పీరయ్య, సుమిత్రానగర్

## మున్సిపల్ కమిషనర్ వివరణ:

సిద్దవటం రోడ్డు , పద్మావతి హాస్పిటల్ వెళ్లే రహదారి వద్ద స్తంభించిన మురికినీటి కాలువలను ఒకసారి పరిశుభ్రం చేయించాం. మరళా ఆ సమస్య ఏర్పడిన విషయం తన దృష్టికి రాలేదు. తక్షణమే కాలువను పరిశుభ్రం చేయించి ఎలాంటి దుర్వాసన లేకుండా చర్యలు తీసుకుంటాం.
ఎం.కృష్ణ, మున్సిపల్ కమిషనర్, బద్వేలు

# నేడుఒంటిమిట్టలో రామాలయంలో ' సీతా జయంతి '

రాజంపేట అర్బన్,మే16 ప్రభాతవార్త



ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో మే 17వ తేదీన శుక్రవారం సీతా జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, పరివార దేవతలకు తిరుమంజనం నిర్వహిస్తారు. అనంతరం మూలవర్లకు వ్యాసాభిషేకం, ఆరాధన, అర్చన చేస్తారు. ఇందులో భాగంగా సాయంత్రం 5 నుండి 6 గంటల వరకు ఆలయంలోని రంగ మండపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై శ్రీ సీతారామ లక్ష్మణ ఉత్సవమూర్తులను వేంచేపు చేస్తారు. అనంతరం విష్వక్సేన పూజ, వాసుదేవ పుణ్యాహవచనం, ఆరాధన, నిర్వహిస్తారు. ప్రత్యేకంగా సీతమ్మవారికి "వాసంతిక పూజ" , మల్లె పూలతో సహస్రనామ అర్చన శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. శ్రీ రామచంద్రమూర్తి చైత్రమాసం శుక్లపక్షం నవమినాడు జన్మించారు. ఒక నెల తరువాత శ్రీమహాలక్ష్మి అవతారమైన సీతాదేవి వైశాఖ మాసం శుక్లపక్షం నవమినాడు అవిర్భవించారు. జనక మహారాజు యాగము చేయుచూ భూమిని దున్నుచుండగా నాగలికి ఒక పెట్టెలో పసిపిల్లగా సీతమ్మవారు అవిర్భవించారు. ఆలయంలో లభించిన శాసనాల ద్వారా 11వ శతాబ్దం నుండి ఈ పర్వదినాన సీతా జయంతి నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని అర్చకులు తెలిపారు.

# ఘనంగా మస్తాన్‌షా ఖాదర్ దర్గా ఉరుసు

రామసముద్రం, మే 16 ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని దిన్నిపల్లె సమీపంలో ఉన్న గాంధీపురంలో హజ్రత్‌మాన్‌ఫీర్ సయ్యద్‌మస్తాన్‌షా ఖాదారీ ఆవర గంధం ఉరుసుమహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతి హిందూ, ముస్లిం సోదరులు ఈ ఉరుసు మహోత్సవంలో పాల్గొని ఉరుసు కార్యక్రమంలో మైసూర్ బృందంచే గొప్ప ఖవ్వాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించడానికి తమిళనాడు తెలంగాణ నుంచి అధికసంఖ్యంలో వచ్చి ఉరుసును వీక్షించారు. ఈకార్యక్రమంలో మన్‌పీర్ సయ్యద్‌బృహాన్‌షా ఖాదరి, మన్‌పీర్ సయ్యద్‌గౌస్‌షా ఖాదరీ, సయ్యద్‌బాబా, ఇమ్రాన్‌షా ఖాదరీ, హజ్రత్ షాఖాదరీ, తోఫిష్‌ఖాదరీ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఖాదర్‌బాషా, దర్గా కమిటీ సభ్యులు పాల్గొని అన్నదానం నిర్వహించారు.

# వైభవంగా దిగువ బండమ్మ అమ్మవారి రథోత్సవం



రామసముద్రం, మే 16 ప్రభాతవార్త :

మండలంలోని కాప్పల్లె పంచాయితీ గజ్జెలవారిపల్లె గ్రామంలో వెలసిన దిగువ బండమ్మ అమ్మవారి రథోత్సవ కార్యక్రమాన్ని గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ రథోత్సవాన్ని వివిద పూలతో అలంకరించారు. ఈ రథాన్ని పురవీదుల్లో ఊరేగింపు జరిగింది. ఈ రథోత్సవంలో పలువురు భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కార్యనిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

# తిప్పారెడ్డి, నిస్సార్‌అహ్మద్‌లను కలసిన వైసిపి నాయకులు

రామసముద్రం, మే 16 ప్రభాతవార్త :



నియోజకవర్గ వైసిపి నాయకులు మాజీ ఎమ్మెల్యేతిప్పారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్‌అహ్మద్‌లను గురువారం పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి మాట్లాడుతూ నిస్సార్‌అహ్మద్ గెలుపుకోసం ప్రతి వైసిపి మండల నాయకులు కష్టపడ్డారని కొనియాడారు. మళ్లీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కావడం, నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా నిస్సార్ గెలిపొందడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. వీరిని కలిసిన వారిలో ఎంపిపి కుసుమకుమారి, సుబ్రమణ్యం, మహబూబ్‌బాషా, భాస్కర్, జబీ, వెంకటేష్, రహంతుల్లా, నరసింహులు, శేషు, తదితరులు పాల్గొన్నారు.

# చేపల వేటకు వెళ్లి చేనేత కార్మికుడు మృతి



మదనపల్లెక్రైం, మే 16 ప్రభాతవార్త:

చేపల వేటకు చెరువుకు వెళ్ళిన ఓ చేనేత కార్మికుడు ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని మృత్యువాడ పడ్డాడు. మదనపల్లెలో గురువారం ఈ ఘటన చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించిన వివరాలిలావున్నాయి. స్థానిక అనపగుట్టలో కాపురం ఉన్న కోటిరెడ్డి కుమారుడు కె.ఈశ్వర్‌రెడ్డి(57) చేపల వేటకు వెళ్ళాడు. చెరువులో చేపలు పడుతుండగా వలలో చిక్కుకొని ప్రమాదవశాత్తు నీట మునిగి మృత్యువాత పడ్డాడు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఉపాధిలో మస్టర్ల మాయాజాలం

- పరాకాష్టకు చేరిన అక్రమాలు
- వేరే మండలాల వారికి మండలంలో మస్టర్‌లో పేర్లు
- ఉపాధి హామీ పథకంలో అంతులేని అవినీతి
- కొనసాగుతున్న కమీషన్ల పర్వం

ఓబులవారిపల్లె, మే 16, ప్రభాతవార్త: రైల్వేకోడూరు నియోజకవర్గంలోని కొన్ని మండలాలలో జాతీయ ఉపాధి హామీ పథకం ఆశయం నీరు కారుతోంది. అవసరం లేని చోట పనులు చేపడుతూ ప్రజా అవసరాలు మేరకు నులు చేయకుండా వర్షం వస్తే కొట్టుకొని పోయి పాములేర్లు ఏటి పొరంబోకు భూములలో లక్షలాది రూపాయలు ప్రజా ధనం ఏటిపాలైందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ పథకం ఉద్దేశం నిరుపేదలకు ఉపాధి కల్పించడమే అయితే కొంత మంది అధికారులు నిర్లక్ష్యం పర్యవేక్షణ లోపం ఉపయోగకరంగా లేని చోట పనులు చేపట్టడం వల్ల ప్రజలకు ఎటువంటి ప్రయోజనాలు చేకూరకుండా లక్షలాది రూపాయలు నీటిపాలవుతోందని తెలుస్తోంది. కొంత మంది ఫీల్డ్ అసిస్టెంట్ అధికారుల బంధుగణం, మిత్రగణం ఉన్న వారి పేర్లను ఓబులవారిపల్లె మండలంలో ఉపాధి హామీ పథకంలో పొందుపరచడం 30 మంది పనిచేస్తే మస్టర్లలో 80 మందికి హాజరు వేయడం పట్టిక చూపించడం కింది స్థాయి అధికారుల నుంచి ఆడిటింగ్ చేసే అధికారుల వరకు లక్ష రూపాయలకు రూ.20వేలు చొప్పున కమిషన్లు ముట్టచెబుతు లక్షలాది రూపాయలు అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు సమాచారం. ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి ఈసీ వరకు లోపాయికారి ఒప్పందాలు చేసుకొని ప్రజా ధనాన్ని నిలువు దోపిడీ చేస్తున్నట్లు తెలుస్తోంది. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో మస్టర్ల మాయాజాలం అడ్డూ అదుపు లేకుండా పోతోంది. కొందరు గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలకు కూడా వాటాలు ముట్టచెబుతున్నట్లు గుస గుసలు వినిపిస్తున్నాయి. ఒక గ్రామ పంచాయతీలో మొదలైన మస్టర్ల మాయాజాలం మండలమంతా వ్యాపించినట్లు తెలుస్తోంది 30 నుంచి 40 శాతం అదనంగా దొంగ మస్టర్లు వేస్తున్నట్లు వినికిడి. పంపకాలు, వాటాల్లో వ్యత్యాసాలు రావడంతో మస్టర్ల బాగోతం బట్టబయలైంది. ఈ వ్యవహారం అన్ని మండలాల్లో జరుగుతోందని సమాచారం జోరందుకుంటోంది. కొంత మంది ఫీల్డ్ అసిస్టెంట్లు అక్కడ పనిచేస్తున్న ఈసీకి సహకరిస్తూ కొంత మంది సహకారంతో ముడుపులు అందించడం జరుగుతున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. ఈ పనులకు నిలువెత్తు సాక్షాలు కూడా మస్టర్ల వివరాలు సాక్షాదారాలు ఉన్నాయని సమాచారం. ఏది ఏమైనా ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడే పనులు ఉపాధి హామీ అధికారులు చేపడితే ఎంతో బాగుంటుందని రైతులు కూడా పంట పొలాలలో పనులు చేసే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చూడాలని మేధావులు, ఆర్థిక విశ్లేషకులు కోరుతున్నారు.

# ట్రిపుల్‌ఐటీకి దరఖాస్తు చేసుకోవడం ఇలా..!



వేంపల్లె, మే 16, ప్రభాతవార్త ః రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్‌ఐటీల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరేళ్ల బీటెక్ సమీకృత ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు వర్సిటీ ఈనెల 6న నోటిఫికేషన్ వెలువరించింది. ఒక్కో ట్రిపుల్‌ఐటీలో 1000 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ కోటాలో మరో 100సీట్లు ఉన్నాయి. ఈ కోర్సులో చేరేందుకు దరఖాస్తులను ఈనెల 8నుండి జూన్ 25 సాయంత్రం 5గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. - రిజర్వేషన్ల కేటాయింపు ఇలా ః ప్రవేశాలలో ఎస్సీలకు 15%, ఎస్టీలకు 6%, బీసీ-సీకి 1%, బీసీ-డికి 7%, బీసీ-ఇకి 4% చొప్పున రిజర్వేషన్లు అమలు చేస్తారు. ప్రత్యేక సీట్ల కింద దివ్యాంగులకు 5%, సైనికోద్యోగుల పిల్లలకు 2%, ఎన్‌సీసీ విద్యార్థులకు 1%, స్పోర్ట్స్ కోటా కింద 0.5%, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటా కింద 0.5%సీట్లను భర్తీ చేస్తారు. ప్రతి కేటగిరిలోనూ 33.33% సీట్లను సమాంతరంగా బాలికలకు కేటాయిస్తారు. - అర్హతలు ఇవే ః అభ్యర్థులు మొదటి ప్రయత్నంలోనే 2024లో పదో తరగతి లేదా తత్సమాన పరీక్షలో రెగ్యులర్ విద్యార్థిగా ఉత్తీర్ణులై ఉండాలి. వయసు 31.12.2024 నాటికి 18ఏళ్లు నిండకుండా ఉండాలి. ఎస్సీ, ఎస్టీ కేటగిరి అభ్యర్థులకైతే 21ఏళ్లు నిండకుండా ఉండాలి. - 4% డిప్రెవేషన్ స్కోర్ ః పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ పద్ధతిలో విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తారు. నాన్ రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ హైస్కూళ్లు, మున్సిపల్ హైస్కూళ్లలో చదివిన విద్యార్థులకు వారి మార్కులకు 4% డిప్రెవేషన్ స్కోర్‌ను అదనంగా కలుపుతారు. దీనిని సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబాటుకు గురైన విద్యార్థులకు ఇచ్చే వెయిటేజీ. 85% సీట్లను స్థానికులకు, 15% సీట్లను మెరిట్ కోటాలో తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు కేటాయిస్తారు.

# క్షయవ్యాధిని నిర్మూలించే బీసీజీ టీకా

పులివెందుల, మే 16, ప్రభాతవార్త ః



క్షయవ్యాధి రాకుండా బీసీటీ టీకా నిర్మూలిస్తుందని వైద్యురాలు రేష్మా తెలిపారు. తొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం 18 సంవత్సరాలు పైబడిన మధుమేహం ఉన్న వారికి, ధూమపానం చేసే వారికి, 60ఏళ్ల పైబడిన వృద్ధులకు క్షయవ్యాధి రాకుండా బీసీజీ టీకాలు వేశారు. ఈ టీకాల వలన క్షయవ్యాధి రాకుండా నిర్మూలించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# డెంగీ వ్యాదిపై అవగాహన ర్యాలీ

కేవి.పల్లె, మే 16ప్రభాతవార్తః

జాతీయ డెంగ్యూ దినోత్సవం పురస్కరించుకుని కేవి.పల్లె మండలం గర్నిమిట్ట పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ అర్చన ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్బంగా డాక్టర్ అర్చన మాట్లాడుతూ డెంగీ వ్యాప్తికి కారణమైన ఎడీఎస్ ఈజిప్టుపై దోమలు మంచి నీటిలో గుడ్లు పెట్టితమ సంతానాన్ని ఉత్పత్తి చేసుకుంటాయని కావున ప్రజలు తమ ఇంటి లోపల మరియు బయట పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకుని వాటికి తోడ్పాటు అందించినప్పుడే వ్యాప్తిని అడ్డుకోగలమని తెలియజేశారు. ఇంటిలోపల కూలర్లు, ఫ్లవర్ వాజులు, పరిసరాలలో వధా ప్లాస్టిక్ సామాన్లు , పాత టైర్లు , మూతలేని సెప్టింక్ ట్యాంకులు తదిరత వాటిని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పద్దతిని పాటించాలన్నారు. డెంగ్యూ దోమ పగటిపూట కట్టుతుందని కావున పగటి పూట దోమ కాటు నుంచి రక్షణకై శరీరమంతా కప్పి ఉండేలా వస్త్రధారణ ఉండాలన్నారు. డెంగీ జ్వరం ప్రమాదకారిగా మారే అవకాశం ఉన్నందుల లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుల్ని సంప్రదించాలని సూచించారు. ఈకార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారిణి భాగ్యలక్ష్మీ, రమాదేవి, రుక్మిణి,పురుషోత్తం, ఆరోగ్య ఆశ కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు. ఫోటోరైటప్ః డెంగీ వ్యాధిపై అవగాహన ర్యాలీ ప్రారంభిస్తు డాక్టర్ అర్చన(3)

## విద్యుత్ ప్రమాదానాకి గురైన శివశంకర్ కుటుంభాన్ని ఆదుకోవాలి

## : వైసిపి నాయకుడు మదుసూధన రెడ్డి

వీరబల్లి, మే16,ప్రభాతవార్త :



విద్యుత్ ప్రమాదానికి గురైన శివశంకర్ కుటుంభాన్ని ఆదుకోవాలని మండలంలోని వంగిమళ్ల వైసిపి నాయకుడు మధుసూధన రెడ్డి తెలిపారు. గురువారం ఆయన నివాసంలో స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ మండలంలోని దిగువ రాచపల్లె పంచాయితీ, పెద్దహరిజనవాడ గ్రామానికి చెందిన బెండకాయల శివశంకర్ ఈ నెల 8వ తేదీన తన నివాసం వద్ద తెగిపడిన కరెంట్ తీగను ప్రమాదవుశాత్తు తగులుకొని ప్రమాదానాకి గురైయ్యాడు. దీంతో అతనిని చకిత్స నిమిత్తం తిరుపతికి తరలించినట్లు తెలిపారు. ఇతనికి గర్బవతి అయిన భార్య, ఒక కుమార్తె ఉన్నారన్నారు. ప్రమాదానికి గురైన శివశంకర్ ఎడమ చేయి పూర్తిగా కాలిపోవడంతో తొలగించారు. దీంతొ కుంటుంభాన్ని పోషించుకోవడానికి వీలులేకుండా పోయిందని తెలిపారు. భార్య బిడ్డలు రోడ్డున పడాల్సి వచ్చిందన్నారు. ఈ కుటుంభాన్ని ఆదుకోవలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర విద్యుత్ శాఖ నియంత్రణ మండలి చైర్మెన్ జస్టిస్ సివి నాగార్జున రెడ్డితో మాట్లాడినట్లు చెప్పారు. అందుకు ఆయన వెంటనే స్పందించి తప్పకుండా ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని అతని కుటుంభ జీవన ఆధారం కోసం ఏదోఒక చిన్న ఉద్యోగం ఇప్పిస్తామని భరోసా ఇచ్చారన్నారు. ఆయన సంబంధిత శాఖాధికారఉలతో మాట్లాడినట్లు కూడా తెలిపారు. ఈ సంఘటనపై ప్రభుత్వం స్పందించి ఆ కుటుంభాన్ని ఆదుకోవాలంటూ పలువురు కోరుతున్నారు. ఈ కార్యక్రమమంలో స్థానిక వైసిపి నాయకులు జయచంద్రా రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, రామిరెడ్డి, వెంకటక్రిష్ణా రెడ్డి,రవి తదితరులు పాల్గొన్నారు.

# మెజార్టీ దక్కేది ఎవరికి

అట్లూరు,మే 16,ప్రభాతవార్త:

రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సార్వత్రిక ఎన్నికలు ముగిశాక అట్లూరు మండలంలో అందలం దక్కేదేవరికి?ఎవరికి మెజార్టీ అన్నది మాత్రం అంతు చిక్క కుండా ఉంది.పోలింగ్ శాతం మాత్రం భీరీగా నమోదయింది.ఉదయం 7 గంటల నుండి పోలింగ్ కేంద్రాల వద్దకు జనం క్యూ కట్టారు గతంలో ఎన్నడూ చూడని విధంగా 81.53 పర్సెంట్ పోలింగ్ జరిగింది ఇది ఎవరికి లాభం?ఎవరికి నష్టం అన్నది మాత్రం ఎవరికీ అంత చిక్కకుండా ఉంది.అట్లూరు మండలంలో 12 పంచాయతీల్లో 25 పోలింగ్ కేంద్రాలు,18899 ఓటర్లు ఉండగా 14675 మంది ఓటు వేశారు చివరకు,ఖచ్చితంగా చెప్పలేక పోతున్నారు.ఇందుకు కారణం ఓటర్లందరు గుంభనంగా ఉండటమే,ఏ నేత వచ్చినా నవ్వుతు అందరిని పలకరిస్తూ ఉండటమే కాబట్టి అంచనాలకు అందడం లేదు.వైసిపి దీమాగా అయితే పాలక ప్రభుత్వ వైసిపి తమ పార్టీకి 2000 నుండి 3000 మెజార్టీ వస్తుందని దీమాలో ఉన్నారు.టిడిపి కూటమి దిమా పోలింగ్ కు వచ్చిన వారిలో అధిక శాతం మంది మాకే ఓటు వేసి ఉంటారని 500 నుండి వెయ్యి వరకు ప్రతి పక్ష పార్టీల కూటమి నేతలు కూడా ధీమా గానే కనిపిస్తున్నారు.పోలింగ్ సరళని బట్టి ఒక అంచనాకు ఈ సారీ రాలేక పోతున్నారు.గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితులు చూడలేదని పలువురూ సీనియర్ నాయకులు,మండల ప్రజలు చర్చికుంటున్నారు.

## బ్రహ్మంగారి ఆరాధన సంధర్బంగా మఠంకు ప్రత్యేక బస్సు సర్వీసులు,

మైదుకూరు మే 16, ప్రభాతవార్త :

బ్రహ్మంగారి మఠం శ్రీపోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకొని మైదుకూరు ఆర్టీసి డిపో నుండి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు మైదుకూరు డిపో మేనేజరు కె.శ్రీనివాసరావు తెలిపారు.ఈనెల 14వ తేది నుండి 19వ తేది వరకు శ్రీపోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన సంధర్బంగా మైదుకూరు ఆర్టీసీ డిపో నుండి బ్రహ్మంగారి మఠంకు వయా మిట్టమానుపల్లె మీదుగా 7ప్రత్యేక బస్సులు,మల్లేపల్లె మీదుగా 15బస్సులు,అలాగే బ్రహ్మంగారి మఠంనుండి జ్యోతి క్షేత్రానికి 2 ప్రత్యేక బస్సులను నడుపుతున్నాని తెలిపారు.ఈ సంధర్బంగా మైదుకూరు పట్టణ,పరిసర మండలాల ప్రజలు మరియు గ్రామ ప్రజలు ఈ సదావకాశాన్ని వినియోగించుకోని శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని తెలిపారు.

## పోస్ట్ పోల్ దృష్టు

## గోడవలకు పాల్పడితే కఠిన చర్యలు,

### అర్బన్ సిఐ ఎపి.మస్తాన్,

మైదుకూరు మే 16, ప్రభాతవార్త : ఎన్నికల తర్వాత మన రాష్ట్రంలో జరుగుతున్న పోస్ట్ పోల్ సంఘటనలు దృష్టిలో పెట్టుకొని వివిధ రాజకీయ పార్టీలుగాని,ప్రజలు గానీ ఎవరైనా సరే గొడవలు పెట్టుకుంటె వారిపైన అటెంప్ట్ మర్డర్ లాంటి నాన్ బైయిలబుల్ కేసులు పెట్టి రిమాండుకు తరలిస్తామని మైదుకూరు అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎపి.మస్తాన్ తెలిపారు.అదే విధంగా రౌడి షీట్స్ కూడా ఓపన్ చేసి,పట్టణ,మండల మరియు జిల్లా బహిష్కరణ చేయడం జరుగుతుందని తెలిపారు.కావున మైదుకూరు టౌన్ మరియు మండలంలోని ప్రజలు ఎవరు కూడా గోడవలు పెట్టుకోవద్దని ఎదైనా సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కొరారు.

## నేటి నుంచి కోనంపేటలో పంచమ

## వేద మహాభారతం యజ్ఞం

లక్కిరెడ్డిపల్లె,మే 16,ప్రభాతవార్త:

ఈ నెల 17 నుంచి మూడో తేదీ వరకు కోణంపేట గ్రామంలో పంచమ వేద మహాభారత వైద్యం నిర్వహిస్తున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు కార్య నిర్వహకులు తెలిపారు.ఈ సందర్బంగా 17వ తేదీన ధ్వజారోపణ 21న బలివండి ఊరేగింపు 23న ద్రౌపతి కళ్యాణం 27న అర్జునతపస్సు జూన్ 1న ఇలా వతుని వధ జూన్ రెండో తేదీన దుర్యోధనువద ఈ ఘటంలో భాగంగా ప్రతి రోజు అరికత కాలక్షేపం నిర్వహిస్తారు హరికథ కళాకా భాగమతిని హైమావతి రేడియో ఆర్టిస్టు ప్రతి రోజు ఒక కట్ట హరికథ కాలక్షేపం ఉంటందని వారు తెలిపారు.అలాగే శ్రీ వెంకటేశ్వర నాట్యమండలి పీలేరు వారిచే రాత్రి వేళల్లో మహ భాగవతం ఘట్టంలోని కొన్ని కార్యక్రమాలు ప్రతిరోజు మధ్యాహ్నవేళలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.ఈ వృక్తి కార్యక్రమాలు బాగా వర్షాలు కురిసి ప్రజలు సంపూర్ణంగా ఉండాలని కొనంపేట గ్రామంలో రాయలసీమ వద్ద మహ యజ్ఞ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్య నిర్వాహకులు తెలిపారు.

## ఈనెల 21న శ్రీ లక్ష్మీ

## నరసింహస్వామి

## 30వ కళ్యాణ మహోత్సవం

లక్కిరెడ్డిపల్లె,మే 16,ప్రభాతవార్త:

మండలంలోని రవీంద్ర నగర్ వద్ద వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి 30వ కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కార్య నిర్వహకులు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కమిటీ సభ్యులు తెలిపారు ఉదయం నుంచి మధ్యాహ్న వరకు లక్ష్మీ నరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు మధ్యాహ్నం అత్యంత వైభవంగా 30వ కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తారు మధ్యాహ్నం లల్లు యాదవ్ దాదా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు రాత్రి వేళల్లో స్వాములువారు ఊరేగింపులో కోలటాం వివిధ సాంస్క ృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు ఈ కళ్యాణ మహోత్సవానికి లక్కిరెడ్డిపల్లె మండల నుంచి కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు పాల్గొని స్వాములవారి కళ్యాణాన్ని తిలికించాలని వారు కోరారు.

# బి.సి.జి వాక్సిన్ వేసుకోండి క్షయ వ్యాధిని నివారిద్దాం

### డి ఎం హెచ్ ఓ డాక్టర్ మల్లేష్



మైదుకూరు రూరల్,మే 16,ప్రభాతవార్త:

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఒనిపెంట నందు గురువారం డీఎంహెచ్ ఓ డాక్టర్ మల్లేష్,డాక్టర్ శ్రీకాంత్,బి.సి.జి వాక్సి నిషేన పర్యవేక్షించడం అయినది.ఈ కార్యక్రమంలో డాక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడిన వారికి క్షయ వ్యాధి నివారణ కొరకు ముందు జాగ్రత్త చర్యలో మోదటి విడతలో భాగంగా షుగర్ వ్యాధి గ్రస్తులకు,పొగ త్రాగు వారికి,గతంలో టీబీ వచ్చిన వారికి,బిఎంఐ 18 కంటే తక్కువ ఉన్నవారికి,షుగర్ వ్యాధి గ్రస్తులకు,60 సంవత్సరములు పైబడిన వారికి బి సి జి వ్యాక్సిన్ కచ్చితంగా బి.సి.జి.వ్యాక్సిన్ వేసి క్షమ వ్యాదిని నిర్మూలించడానికి అవశ్యకత ఎంతైనా ఉన్నదని పేర్కొనడమైనది.ఈ కార్యక్రమంలో హాస్పిటల్స్ సిబ్బంది.బుజ్జి,ఏఎన్ఎం,ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



# వేదమూర్తిరెడ్డి మృతి తీరనిలోటు

## - సంతాపం తెలియజేసిన మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

గాలివీడు, మే 16(ప్రభాతవార్త):



సింగిల్ విండో అధ్యక్షులు మిట్టపల్లి వేదమూర్తిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి గురువారం స్థానిక వైకాపా నాయకులతో కలిసి వేదమూర్తిరెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు

:ఆర్టీసీ డిఎం శ్రీనివాసరావు



బద్వేలు అర్బన్, మే 16 ప్రభాతవార్త : శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన గురుపూజ ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 17 నుంచి 19వ తేది మూడు రోజుల పాటు బద్వేలు నుంచి బ్రహ్మంగారిమఠంకు 12 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని ఆర్టీసీ డిఎం శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా డీఎం .శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన గురుపూజ ఉత్సవాలలో భాగంగా స్వామివారిని భక్తులు దర్శించుకునేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయడం జరిగిందని కావున బద్వేలు ప్రాంత ప్రజలందరూ ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేయుటకు అన్ని రకాల ఏర్పాట్లు చేయడం జరిగిందని, వీటిని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రయాణీకులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు కృషిచేస్తున్నామన్నారు.

## రైతులకు సబ్సిడీ వేరుశనగ, పచ్చిరొట్ట, ఎరువులు పంపిణీ

## - జిల్లా వ్యవసాయాధికారి చంద్రా నాయక్



రాయచోటి అర్బన్, మే 16, ప్రభాతవార్త: జిల్లాలోని రైతులకు సబ్సిడీపై వేరుశనగ మరియు పచ్చిరొట్టె ఎరువులైన జనుము, జీలుగ, పిల్లి పెసర విత్తనాలు పంపిణీ చేయడంజరుగుతుందనిజిల్లా వ్యవసాయాధికారి చంద్రా నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.అన్నమయ్య జిల్లాలోని రైతులందరికి 40% సబ్సిడీపై వేరుశనగ, జీలు, పిల్లిఎసర విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందని జనుము 2578 క్వింటాళ్లు, జీలుగ 2492 క్వింటాళ్లు, పిల్లిపెసర 76 క్వింటాళ్లు మంజూరయ్యాయన్నారు. వేరుశనగ కె-6రకం 35323 క్వింటాళ్లు, నారాయణి 18046 క్వింటాళ్లు, టీసీజీఎస్ 900 క్వింటాళ్లు, కదిరే లేపాక్షి 1114 క్వింటాళ్లు జిల్లాకు వచ్చాయన్నారు. రైతులందరూ తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి కావాల్సిన విత్తనాలు ఎంపిక చేసుకొని తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలోని మండల వ్యవసాయాధికారులు, మరియు గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు ఈ విషయాన్ని రైతులకు తెలియజేసి రైతుల పేర్లు నమోదు చేయాలన్నారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు ఇంటిపై దాడి చేయడం హేయమైన చర్య

కడపకార్పొరేషన్,మే16, ప్రభాతవార్త:



రాయచోటి మార్కెట్ చైర్మన్, బీసీ నాయకుడు వండాడి వెంకటేశ్వర్లు ఇంటిపై దాడి చేయడం హేయమైన చర్య అని టీటీడీ బోర్డు మెంబర్ యానాదయ్య అన్నారు. ఎన్నికలయ్యాక టీడీపీ నాయకులు ఉద్దేశపూర్వకంగా దాడులు చేస్తున్నారని ఆరోపించారు. బీసీ నాయకుడు వండాడి వెంకటేశ్వర్లును పోలింగ్ రోజునే అసభ్యపదజాలంతో దూషించారన్నారు. వారి ఇంటిపై దాడి చేసి కార్లు, ఫర్నీచర్ ధ్వంసం చేశారన్నారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం టీడీపీ వైసీపీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ నాయకులు దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలపై దాడులు అధికమయ్యా యని బాధను వ్యక్తం చేశారు. దాడులు చేస్తే సహించమన్నారు. దాడులు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో 10వ డివిజన్ కార్పొరేటర్ మల్లికార్జున, 4వ డివిజన్ వైసీపీ ఇన్‌ఛార్జి ఆర్.వి.రమణ, నాయకులు కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

## దోమలను అరికడదాం.. డెంగీని పారదోలుదాం



రామాపురం, మే 16, ప్రభాతవార్త: దోమలను అరికడదాం.. ప్రాణాంతకమైన డెంగీ వ్యాధిని పారదోలుదామని మండల వైద్యాధికారులు వినోద్‌కుమార్, దివ్యశ్రీ అన్నారు. జాతీయ డెంగీ వ్యాధి దినోత్సవ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి 3 రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేని పాటిద్దాం దోమ కాటు నుంచి మనం కాపాడుకుందామని పిలుపునిచ్చారు. విష జ్వరాలను కలిగించే దోమ లార్వాలను అంతం చేయాలని నీరు నిల్వ ఉన్న ప్రాంతాలలో వేస్ట్ ఆయిల్ వేసి, అలాగే దోమ తెరలు వాడడం వల్ల కాపాడుకోవచ్చన్నారు. ఈ ర్యాలీలో సీహెచ్‌వో ఎలిజర్, పీహెచ్ఎస్ విజయలక్ష్మీ, హెల్త్ సూపర్‌వైజర్ ఉమామహేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీలు ఏఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

## సర్వేలన్నీ వైకాపా విజయాన్ని తెలియజేస్తున్నాయి

పులివెందుల రూరల్, మే 16, ప్రభాతవార్త ః

సర్వేలన్నీ వైఎస్ఆర్‌సీపీ విజయాన్ని తెలియజేస్తున్నాయని సివిల్ సప్లైస్ డైరెక్టరు హాల్ గంగాధర్‌రెడ్డి, కౌన్సిలరు కోడిరమణ, జేసీఎస్ ఇన్‌ఛార్జి పార్నపల్లె కిషోర్, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి డేనియల్ బాబులు అన్నారు. పులివెందులలో గురువారం వారు విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మఓహన్‌రెడ్డి గురువారం ఐప్యాక్ ప్రతినిధులతో భేటీ సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై వారు స్పందించి మాట్లాడారు. 2019 ఫలితాల కంటే మరింత మెరుగైన విజయాన్ని వైఎస్ఆర్‌సీపీ అందుకోబోతున్నట్లు తెలిపారు. సీఎం మరింత మెరుగైన పాలన అందిస్తారని, సంక్షేమ పథకాలతో ప్రజలంతా లబ్ధి పొందుతారన్నారు. ఈ

